వారికి జరగబోయే అవమానాన్ని వూహించుకొని నన్ను అసహ్యించుకొనే వీళ్ళ మధ్యే ఒక్క నిముషం ఉండకూడదు. తనూ ఒక మనిషేనని, తనకీ మనసుందని, అది విరిగిన చోట తను ఒక్కక్షణం కూడా వుండలేననీ,

ఈ విశాల ప్రపంచంలో, తన హస్తకళా నైపుణ్యంతో ఎక్కడైనా బ్రతకగలనని నిరూపించాలని అనుకుంది. కానీ, సాంప్రదాయంకోసం చచ్చిపోయే కుటుంబాలు, అలా పోతే మరీ కుళ్ళి, కుళ్ళి ఏడుస్తారనే ఆలోచనతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుంటూ. వారి ప్రవర్తన చూసి, వారు చూపే విముఖత భరించలేక, వళ్ళు కోసే కత్తితో ప్రాణాలు తీసుకుంది శిరీష, తన భావాలనన్నింటినీ కాగితంలో రాసి భర్త పాదాలముందుంచుతూ.

మళ్ళీ జనం పోగయ్యారు. "పాపం, తనకి జరిగిన మానభంగాన్ని భరించలేక, ఆత్మహత్య చేసుకుంది" అంటూ ఆండాళ్ళమ్మగారితో సహా అందరూ అనడం చెవులారా విని, కన్నీరు పెట్టుకోవడం కొనవూపిరితో కళ్ళారా చూసి నవ్వుతూ కన్నుమూసింది శిరీష.

o o o o o

"శిరీషమ్మా" అంటూ అరిచింది రాములమ్మ జరిగినదంతా బుర్రలో మెదులుతూంటే.

"హు... పిచ్చిదానా!... ఆ యమ్మని తలుచుకోని బాధపడుతున్నావా? ఆప్ను పెద్దోళ్ళు. పరువూ, మరియాదా అంటూ పానాలు తీస్తారు. ఆళ్ళకి నాయం, సత్యం ఇయ్యి రుసించవు. నిన్నట్లా ఒదులుకోటానికి రఘుబాబు గారిలా సదువుకున్నోణ్ని గాను నేను. మామూలు మనిషిని నేను, సాటి మనిషిగా నీ కష్టాన్ని అరదం చేసుకునే మనిషిని. నాకన్న బలవంతుడొచ్చి నన్ను నాలుగు తన్ని మక్కిలిరగగొడితే, అది

